సాక్షి చిత్తూరు

గురువారం । 22 । మే । 2025



పలమనేరుకు కుంకీ ఏనుగులు

కర్ణాటక నుంచి బయలు దేరిన కుంకీ ఏనుగులు బుధవారం రాత్రికి పలమనేరుకు చేరుకున్నాయి. - 8లో



మృగరాజుపై వేణుగోపాలుడు

కార్వేటినగరంలోని వేణుగోపాలస్వామి సింహ వాహనంపై బుధవారం భక్తులకు దర్శనమిచ్చారు. - 8లో



డీసీహెచ్ఎస్‌లో వర్గపోరు

డీసీహెచ్ఎస్ కార్యాలయంలో వర్గపోరు తారస్థాయికి చేరడంతో ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. - 8లో

విశ్వరూపం.. దివ్యతేజం



భక్తులతో కిక్కిరిసిన ఆలయ వీధులు

- అమ్మవారిని దర్శించుకున్న సీఎం దంపతులు
- విచిత్ర వేషధారణలతో మొక్కులు చెల్లించుకున్న భక్తులు
- జనసంద్రంగా మారిన ఆలయ ప్రాంగణం

కుప్పం : శ్రీ ప్రసన్న తిరుపతి గంగమాంబ జాతర సందర్భంగా బుధవారం అమ్మవారి విశ్వరూప దర్శనం కనులపండుగగా జరిగింది. శిరస్సు ఊరేగింపు ముగించుకుని అమ్మవారి ఆలయంలో విశ్వరూప దర్శనం ఏర్పాటు చేశారు. ఏడాదికి ఒక్కసారి మాత్రమే జరిగే విశ్వరూప దర్శనాన్ని తిలకించేందుకు లక్షల సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. పొంగళ్లు, పిండితో తయారు చేసిన దీపాలతో అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారిని వజ్ర కిరీటం, బంగారు ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఎప్పుడు లేని విధంగా ఈ ఏడాది ప్రత్యేక దర్శనం కోసం రూ.100, రూ.200 టికెట్లు పెట్టి వీ ఐపీలకు దర్శన సౌకర్యం కల్పించారు.

అమ్మవారిని దర్శించుకున్న సీఎం దంపతులు

ముఖ్యమంత్రి చంద్రబాబు, సతీమణి భువనేశ్వరి బుధవారం శ్రీ ప్రసన్న తిరుపతి గంగమాంబ దర్శనం చేసుకున్నారు. బుధవారం ఉదయం చంద్రబాబు 12.30 గంటలకు బెంగళూరు నుంచి కుప్పంలోని ద్రవిడ వర్సిటీ హెలీప్యాడ్ వద్దకు చేరుకుని అక్కడి నుంచి దేవస్థానానికి చేరుకున్నారు. అనంతరం 2 గంటలకు బెంగళూరుకు తిరుగు ప్రయాణమయ్యారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న ముఖ్యమంత్రి చంద్రబాబు దంపతులు

న్యూస్‌రీల్

ఎండీయూ వ్యవస్థ రద్దు చేయవద్దు

చిత్తూరు కార్పొరేషన్ : ప్రజలకు నిత్యావసరాల పంపిణీ చేస్తున్న ఎండీయూ వ్యవస్థను రద్దు చేయవద్దని సీపీఎం జిల్లా కార్యదర్శి గంగరాజు బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. ఎండీయూ వ్యవస్థను మెరుగుపరచడం మాని రద్దు చేయడం సరికాదన్నారు. ప్రజలకు అవస్థలు లేకుండా ఇంటి వద్దకు బియ్యం వాహనాల్లో ఇవ్వడం మంచి పని అన్నారు. కూటమి ప్రభుత్వం వాగ్దానం చేసినట్లుగా బియ్యంతో పాటు చింతపండు, కంది పప్పు, నూనె ఇవ్వాలని కోరారు.

నేడు ప్రత్యేక విద్యుత్ అదాలత్

చిత్తూరు కార్పొరేషన్ : వినియోగదారుల సమస్యల పరిష్కారానికి గురువారం ప్రత్యేక విద్యుత్ అదాలత్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ మునిచంద్ర తెలిపారు. ఉదయం చిత్తూరులోని గాంధీరోడ్డులోని డివిజన్ కార్యాలయంలో 11.30 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. కమిటీలో చైర్‌పర్సన్‌గా విశ్రాంత జడ్జి శ్రీనివాసఆంజనేయమూర్తి, ఆర్థిక సభ్యులు రామమోహన్, సాంకేతిక సభ్యులు అంజనీకుమార్, స్వతంత్ర సభ్యులు విజయలక్ష్మి ఉంటారన్నారు. చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గాల వినియోగదారులు సమస్యలను తెలుపవచ్చని వివరించారు.

పిడుగుపాటుకు కొబ్బరి చెట్టు దగ్ధం



చౌడేపల్లె : మండలంలోని శెట్టిపేట సమీపంలో మంగళవారం రాత్రి పిడుగుపాటుకు గురై కొబ్బరి చెట్టు ధ్వంసమైన ఘటన వెలుగులోకి వచ్చింది. రైతు బ్యాంకు రెడ్డెప్ప బుధవారం పొలం వద్దకు వెళ్లి అగ్నికి ఆహుతైన చెట్టును గుర్తించారు. పిడుగుపాటుకు చెట్టుతో సహా మామిడి చెట్లు దెబ్బతిన్నాయని చెప్పారు.

రుణపాశం





రైతు భరోసా కేంద్రానికి విత్తనాల కోసం వచ్చిన రైతులు (ఫైల్)

రైతన్నలకు రుణాల రెన్యూవల్ కన్నీళ్లు పెట్టిస్తున్నాయి. ఏటా బ్యాంకుల్లో రుణాలకు వడ్డీ చెల్లించుకొని రెన్యూవల్ చేసేవారు. కొత్త నిబంధనల పేరుతో బ్యాంకర్లు రుణాలు మొత్తం చెల్లిస్తేనే రెన్యూవల్ అంటూ మెలిక పెట్టడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. చేతిలో చిల్లిగవ్వలేని పరిస్థితిలో రుణాలు మొత్తం ఎలా చెల్లించాలో తెలియక .. ఇలా అయితే ఆత్మహత్యలే శరణ్యం అంటూ తీవ్ర నైరాశ్యం చెందుతున్నారు. జిల్లాలోని ఏ రైతును కదిలించినా కన్నీటి వెతలే వినిపిస్తున్నాయి. రుణాల విషయంలో మినహాయింపులు ఇవ్వాలని అన్నదాతలు వేడుకుంటున్నారు. – కాణిపాకం

- బ్యాంకు అధికారుల కొర్రీలు
- వ్యవసాయ, బంగారు రుణాలకు రెన్యూవల్ కష్టాలు
- పూర్తిగా డబ్బులు చెల్లించాలంటూ మెలిక
- అవస్థల్లో అన్నదాతలు
- ప్రభుత్వ తీరుపై మండిపాటు

వ్యవసాయ రుణం రణంగా మారింది. బ్యాంకర్లు రైతులకు అనేక కొర్రీలు పెడుతున్నారు. వ్యవసాయం, బంగారు ఆభరణాల పేరుతో రైతులు, రుణదారులు తీసుకున్న రుణాలకు రెన్యూవల్ కష్టాలను తెచ్చి పెట్టారు. పూర్తిగా డబ్బులు చెల్లిస్తేనే రెన్యూవల్ అంటూ మెలిక పెడుతున్నారు. పూర్తిగా చెల్లించి రెన్యూవల్ చేసుకోవాలని చెబుతుండడంతో రైతులు, రుణదారులకు కన్నీళ్లు తెప్పిస్తున్నాయి. దీంతో కొందరు రైతులు అప్పులు చేసి రెన్యూవల్ చేస్తే.. మరికొందరు పరేషాన్ అవుతున్నారు. ఈ విధానంపై పలువురు రైతులు మండిపడుతున్నారు.

35 లక్షల ఖాతాలు

జిల్లాలో 232 బ్యాంకులున్నాయి.. వీటికి కింద సుమారు రూ.35 లక్షల ఖాతాలున్నట్లు అధికారుల అంచనా. వీరు కొన్ని వేల కోట్లు అప్పులు చేసినట్లు లెక్కలు చెబుతున్నాయి. ఇందులో వ్యక్తిగత, వ్యవసాయం, బిజినెస్, గృహ, వాహన సంబంధిత వాటి కోసం బ్యాంకుల్లో రుణాలు పొందారు. వీటి చెల్లింపులో వ్యకిగత రుణాలకు మినహాయింపులు ఇస్తున్నారు. అయితే వ్యవసాయ ఆధారిత రుణాల విషయంలో బ్యాంకర్లు చిన్న చూపు చూస్తున్నారు. రెన్యూవల్ పేరుతో వేధిస్తున్నారు.

> • చిత్తూరు మండలానికి చెందిన రాజు అనే రైతు 2021లో వ్యవసాయ పనుల నిమిత్తం ఓ బ్యాంకులో బంగారు ఆభరణాలు పెట్టి రూ.60 వేల వరకు రుణం తీసుకున్నాడు. ఏటా రెన్యూవల్ చేస్తూ వస్తున్నాడు. రెండు రోజుల కిందట బ్యాంకు రెన్యూవల్ కోసం బ్యాంకుకు వెళ్లిన రైతు రాజుకు బ్యాంకు అధికారులు షాక్ ఇచ్చారు. మొత్తం డబ్బు చెల్లించి రెన్యూవల్ చేసుకోవాలని.. ఇప్పుడు కొత్త రూల్స్ అంటూ చెప్పుకొచ్చారు. దీంతో చేసేదీ లేక రాజు అప్పు చేసి రూ.లక్ష చెల్లించి రెన్యూవల్ చేయించుకున్నాడు. ఇలా ఈ రైతు ఒక్కరే పరిస్థితి కాదు. లక్షల మంది అన్నదాతల సమస్య ఇదే.

గతంలో రెన్యూవల్ ఇలా..

గతంలో బ్యాంకుల్లో వ్యవసాయ, బంగారు రుణాలకు రెన్యూవల్‌కు వెళ్తే ఇబ్బందులు పెట్టేవారు కాదు. వడ్డీ వరకు చెల్లించుకుని రెన్యూవల్ చేసేవారు. లేకుంటే భూ విలువ, బంగారు విలువ ప్రకారం తీసుకున్న బ్యాంకు రుణానికి ఏటా 5 నుంచి 10 శాతం వరకు పెంచుతూ వడ్డీ జమ చేసుకునే వారు. ఇలా రైతులకు ఇబ్బందులు లేకుండా రెన్యూవల్ సదుపాయం కల్పించేవారు. ఈ ఫలితంగా బ్యాంకర్లకు రుణదారుల నుంచి రెన్యూవల్ చేయించే విషయంలో సమస్యలు తలెత్తేవి కావు. ఈ ప్రక్రియ గంట, గంటన్నర వ్యవధిలోనే జరిగిపోయేది. ఇప్పుడు అలా కాకుండా వ్యవసాయ రైతులు, రుణదారులకు సవాలక్ష ఆంక్షలు పెడుతున్నారు.

ఏటా నష్టాలు.. అప్పులే

వ్యాపార లావాదేవీలు, వ్యవసాయం పేరుతో తక్కువ వడ్డీకి బ్యాంకుల్లో రుణాలు తీసుకుని వడ్డీ వ్యాపారులు చేసుకుంటున్నవారు 30 శాతం మంది ఉన్నారని అంచనా. అలాగే 70 మంది మాత్రం వ్యవసాయ పనులు నిమిత్తం, బతుకు తెరువు కోసం పట్టాపాసు పుస్తకాలు, బంగారు ఆభరణాలు బ్యాంకుల్లో కుదవపెట్టి రుణాలు తీసుకుంటున్నారు. ఆ రుణాల ద్వారా వ్యవసాయ వృద్ధి చేసుకుంటున్నారు. బోరు వేసుకోవడం, కొత్త రకం పంటలు పండించడం, మామిడి మొక్కలు పెట్టించడం, వరి, లేకుంటే ఏటా మామిడికి సాగుకు అవసరమ్యే ఖర్చులను భరించేందుకు బ్యాంకుల్లో అప్పులు చేస్తున్నారు. ఆపై వాటిని విడిపించేందుకు అష్ట కష్టాలు పడుతున్నారు. పంట బాగా పండి..మంచి ధర ఉంటే రైతు వాటిని విడిపించుకునేందుకు వెనకడుగు వేయడంలేదు. ప్రకృతి కాటేయడంతో ఏటా కష్టాలు,..కన్నీళ్లు మిగలడం లేదు. దీనిపై ప్రభుత్వం స్పందించి రెన్యూవల్ విషయంలో రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

మొత్తం చెల్లిస్తేనే రెన్యూవల్ అంటూ వేధింపులు

10 శాతం బ్యాంకులు మినహా..మిగిలిన బ్యాంకులన్నీ రెన్యూవల్ విషయంలో రుణదారులను ముప్పుతిప్పలు పెడుతున్నాయి. రెన్యూవల్ పేరుతో వేధిస్తున్నాయి. తీసుకున్న రుణానికి ఏడాది గడువు తీరిందని మెసేజ్‌లు రావడంతో బ్యాంకులకు రుణదారులు పరుగులు పెడుతున్నారు. అక్కడికి వెళ్లాక బ్యాంకర్లు రెన్యూవల్ చేసుకోవాలంటే తీసుకున్న మొత్తం డబ్బులు చెల్లిస్తేనే రెన్యూవల్ చేస్తామని మెలిక పెడుతున్నారు. వడ్డీ చెల్లింపుతో..రెన్యూవల్ చేయడం ఇకపై కుదరదని స్పష్టంగా చెప్పేస్తున్నారు. దీంతో వడ్డీ భారం పడుతుందని చాలా మంది అష్టకష్టాలు పడి రెన్యూవల్ చేయించుకుంటున్నారు. కొన్ని బ్యాంకులు తీసుకున్న రుణాలను పూర్తిస్థాయిలో చెల్లించినా.. మళ్లీ రుణాలు ఇవ్వడంలో రైతులు, రుణదారులను ఇబ్బందులు పెడుతున్నారు. రేపు రమ్మని చెప్పి వాళ్లను తిప్పించుకుంటున్నారు. సీ–బిల్, కేవైసీ, ఇతర వివరాల సాకు చూపి జాప్యం చేస్తున్నారు. గట్టిగా తిరగబడితే ఆర్బీఐ రూల్స్ అంటూ వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఈ పోరు పడలేక రెన్యూవల్ చేసుకునేందుకు చాలా మంది ముందుకు రావడంలేదు.

వ్యవసాయ రుణ వివరాలు ఇలా..

సీజన్	రుణ లక్ష్యం (రూ. కోట్లలో)	ఇచ్చిన రుణం (రూ. కోట్లలో)
ఖరీఫ్–2024	4,072	4,435
రబీ–2024–25	2,830	3,120
మొత్తం	9,602	7,555
టర్మ్‌లోన్లు	3,284	3,341

మినహాయింపు ఇవ్వాలి



ఆటో కొనుగోలు చేసేందుకు గతేడాది జీడీ నెల్లూరు మండల కేంద్రంలోని ఓ బ్యాంకులో బంగారం తాకట్టు పెట్టి రూ. లక్ష వరకు రుణం తీసుకున్నా. రెన్యూవల్‌కు సంబంధించి మెసేజ్ రావడంతో బ్యాంకు వద్దకు వెళ్లా. అక్కడ బ్యాంకర్లు అసలు, వడ్డీ చెల్లించాలని మొండికేశారు. వడ్డీ చెల్లించి రెన్యూవల్ చేస్తాను.. అంటే వాళ్లు ఒప్పుకోలేదు. అవస్థలు పడి మొత్తం డబ్బులు చెల్లించి ఏప్రిల్ 10వ తేదీన రెన్యూవల్ చేశా. ప్రభుత్వం రెన్యూవల్ విషయంలో మినహాయింపు ఇచ్చేలా చూడాలి.

– బాబు, జీడీనెల్లూరు

కొత్త విధానం అమల్లో ఉంది



రెన్యూవల్ కొత్త విధానం 2024 సెప్టెంబర్ నుంచి అమల్లోకి వచ్చింది. ఆర్బీఐ నిబంధనల ప్రకారం ఇకపై పూర్తి నగదు చెల్లించి రెన్యూవల్ చేయించుకోవాలి. ఇకపై వడ్డీ చెల్లించి రెన్యూవల్ చేయించుకునే పద్ధతి లేదు. దీనిపై సమస్యలు వస్తున్నాయి. కొంత మంది మంత్రులు ఈ విషయంపై చర్చిస్తున్నారు. ఇది ఉన్నత స్థాయిలో జరగాల్సిన విషయం.

– హరీష్, ఎల్‌డీఎం, చిత్తూరు

బదిలీల జాతర

ఎప్పుడెప్పుడాని ఎదురుచూసిన టీచర్ల బదిలీల జాతరకు ఎట్టకేలకు రాష్ట్ర విద్యాశాఖ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. బుధవారం బదిలీల ఉత్తర్వులను జారీ చేసింది. ఆ ఉత్తర్వుల మేరకు ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని సర్కారు బడుల్లో విధులు నిర్వహిస్తున్న టీచర్ల బదిలీల ప్రక్రియ చేపట్టేందుకు చిత్తూరు విద్యాశాఖ అధికారులు కసరత్తు వేగవంతం చేశారు. పకడ్బందీగా బదిలీలు చేపట్టేందుకు జిల్లా విద్యాశాఖ రంగం సిద్ధం చేసింది.

- విడుదలైన టీచర్ల బదిలీల ఉత్తర్వులు
- కసరత్తు వేగవంతం చేసిన జిల్లా విద్యాశాఖ
- ట్రాన్స్‌ఫర్ పోర్టల్ ప్రారంభం



బదిలీల కసరత్తు నిర్వహిస్తున్న విద్యాశాఖ సిబ్బంది

చిత్తూరు కలెక్టరేట్ : టీచర్ల బదిలీలకు రాష్ట్ర విద్యాశాఖ బుధవారం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. బదిలీల ప్రక్రియపై విద్యాశాఖ రాష్ట్రస్థాయి అధికారులు ఈనెల 21న డీఈఓలకు వెబెక్స్ నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ వెబెక్స్‌లో జిల్లా నుంచి డీఈఓ వరలక్ష్మి, ఏడీలు సుకుమార్, వెంకటేశ్వర్లు హాజరయ్యారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రాతిపదికన చేపట్టే ఈ బదిలీలకు బుధవారం ట్రాన్స్‌ఫర్ పోర్టల్ ప్రారంభం అయింది. ఈ ప్రక్రియ జూన్ 5 నాటికి పూర్తి చేయనున్నారు. ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలు, ఎస్‌ఏలకు వెబ్ కౌన్సెలింగ్ ద్వారా బదిలీలు చేపట్టనుండగా, ఎస్జీటీలకు మాన్యువల్‌గా నిర్వహించనున్నారు.

హడావుడిగా దరఖాస్తు చేసుకోవాలని..

బదిలీ ఉత్తర్వులు విడుదలయ్యాయో లేదో అప్పుడే హడావుడిగా పలు కేడర్‌ల టీచర్లు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఉత్తర్వులు జారీచేశారు. ఈ నెలాఖరుకు 5 సంవత్సరాలు ఒకేచోట పనిచేసిన హెచ్‌ఎంలు గురువారం సాయంత్రం 5గంటల్లోపు బదిలీ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ప్రిఫరెన్షియల్ కేటగిరిలోని టీచర్లు మెడికల్ బోర్డు వెరిఫికేషన్‌కు బుధవారంతో గడువు పూర్తి కానుంది. సమస్యల పరిష్కారం కోసం మండల స్థాయిలో కంట్రోల్ రూం ఏర్పాటు చేసేందుకు కసరత్తు చేపడుతున్నారు.

బదిలీల షెడ్యూల్ ఇలా..

ప్రక్రియ	హెచ్‌ఎం	స్కూల్ అసిస్టెంట్	ఎస్జీటీ
బదిలీలకు దరఖాస్తులు	ఈనెల 21, 22	ఈనెల 21 నుంచి 24	ఈనెల 21 నుంచి 27
పరిశీలన	ఈనెల 21,22	ఈనెల 21 నుంచి 25	ఈనెల 21 నుంచి 28
ప్రావిజనల్ సీనియారిటీ జాబితా	24	26,27	31
గ్రీవెన్సెస్	25	28	28 నుంచి జూన్ 1
గ్రీవెన్సెస్ పరిష్కారం	26	28, 29	28 నుంచి జూన్ 2
తుది సీనియారిటీ జాబితా	27	31	జూన్ 6
వెబ్ ఆప్షన్స్	28	జూన్ 1, 2	జూన్ 7 నుంచి 10
బదిలీ ఉత్తర్వులు	30	జూన్ 4	జూన్ 11
ఉద్యోగోన్నతులు	మే 30 (ఎస్‌ఏ నుంచి హెచ్‌ఎం)	జూన్ 5 (ఎస్జీటీ నుంచి ఎస్‌ఏ)	
ఉద్యోగోన్నతులు ఉత్తర్వులు	మే 31	జూన్ 6	

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఖాళీల వివరాలు

యాజమాన్యం	ఖాళీలు
ప్రభుత్వ	125
ఎంపీపీ/జెడ్పీ	1583
మున్సిపల్ కార్పొరేషన్	135
మున్సిపల్	75
5/8 ఏళ్లు ఒకేచోట పనిచేసిన టీచర్లు	3000
మిగులు పోస్టులు	500
రీ అపోర్షన్/ షిఫ్టెడ్	1582
మొత్తం	7000

ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో..

టీచర్ల బదిలీల కసరత్తు ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో నిర్వహిస్తున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 4916 పాఠశాలలున్నాయి. వీటిలో 3766 ప్రాథమిక, 445 ప్రాథమికోన్నత, 705 ఉన్నత పాఠశాలలు.17,372 మంది టీచర్లకు గాను 15,454 పనిచేస్తున్నారు. 37 విభాగాల్లో 1918 పోస్టులను క్లియర్ వేకెన్సీలుగా చూపించగా, మరో 5082 ఖాళీలుగా చూపించారు. ఒకే పాఠశాలలో ఐదు సంవత్సరాలు పూర్తి చేసిన హెచ్‌ఎంలు, 8 సంవత్సరాల సర్వీసు పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులు తప్పనిసరిగా బదిలీ కానున్న నేపథ్యంలో 5/8 ఏళ్లు ఒకే చోట పనిచేసిన టీచర్ల ఖాళీలు 3 వేలు చూపగా, మిగులు, (సర్‌ప్లస్) కింద 500, స్కూల్ కొత్త పోస్టులు (రీఅపోర్షన్), ఒక యాజమాన్య పాఠశాల నుంచి మరో యాజమాన్య పాఠశాలల్లో నెలకొన్న (షిఫ్టెడ్) ఖాళీలు 1582 చూపుతున్నారు.

పకడ్బందీగా చేపడుతాం

బదిలీల కసరత్తు నిబంధనల ప్రకారం పకడ్బందీగా నిర్వహించడం జరుగుతుంది. బదిలీలు నిబంధనల మేరకు చేపడుతాం. ఇందులో ఎలాంటి అనుమానాలకు ఆస్కారం లేదు. టీచర్లు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే సమయంలో జాగ్రత్తలు పాటించాలి.

– వరలక్ష్మి, డీఈఓ, చిత్తూరు

ప్రైవేటు కళాశాలలపై నిఘా

ఎంత కట్టడి చేసినా ఏటా అనుమతులు లేని ప్రైవేట్ జూనియర్ కళాశాలలు పుట్టుకొస్తూనే ఉన్నాయి. మరో 11 రోజుల్లో ఇంటర్మీడియట్ కళాశాలలు పునఃప్రారంభం కానున్నాయి. అడ్మిషన్ల పెంపుపై ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నారు. వేసవి సెలవుల అనంతరం కళాశాలలు ప్రారంభం కానున్న నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా చేపడుతున్న ప్రభుత్వ కళాశాలల కసరత్తుపై ఇంటర్మీడియట్ ఆర్జేడీ, డీఐఈవో డా.ఆదూరు శ్రీనివాసులతో సాక్షి ముచ్చటించింది.. వివరాలు ఆయన మాటల్లోనే..





డా.ఆదూరు శ్రీనివాసులు
ఇంటర్మీడియట్ ఆర్జేడీ, డీఐఈవో

- అనుమతుల్లేని కళాశాలలుంటే సీజ్
- ప్రభుత్వ జూనియర్ కళాశాలల బలోపేతానికి కృషి
- పకడ్బందీగా బదిలీల ప్రక్రియ
- పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ
- జూన్ 2న జూనియర్ కళాశాలలు పునఃప్రారంభం
- సాక్షి ఇంటర్వ్యూలో ఇంటర్మీడియట్ ఆర్జేడీ, డీఐఈవో డా.ఆదూరు శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ కళాశాలల్లో ఇప్పటికే అడ్మిషన్‌ల ప్రక్రియ కొనసాగుతోంది. గతేడాది కంటే రానున్న విద్యాసంవత్సరంలో అడ్మిషన్‌ల పెంపునకు పకడ్బందీగా కసరత్తు చేపడుతున్నాం. ప్రభుత్వ కళాశాలల్లో ఉన్న మౌలిక సదుపాయాలు, వసతులు, కోర్సులు, మధ్యాహ్న భోజనం, అనుభవం ఉన్న అధ్యాపకులు తదితర సౌకర్యాలను క్షేత్రస్థాయిలో ప్రచారం చేయడం జరుగుతోంది. ప్రభుత్వ కళాశాలల్లోని ప్రతి ప్రిన్సిపల్ తమ వంతు బాధ్యతగా అడ్మిషన్‌ల పెంపుపై ప్రత్యేక ఫోకస్ చేయాలని ఆదేశించాం. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదివే విద్యార్థులు పోటీ పరీక్షలకు పోటీ పడేలా ఈ విద్యా సంవత్సరం నీట్, జేఈఈ, ఎంసెట్, తదితర పరీక్షలకు మెటీరియల్, ప్రత్యేక శిక్షణ ఇవ్వడం జరుగుతుంది.

తొలిరోజే పాఠ్యపుస్తకాలు ఇచ్చేలా..

జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ యాజమాన్య పరిధిలో ఉన్న ప్రతి కళాశాలలో తొలిరోజే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు ఇచ్చేలా చర్యలు చేపడుతున్నాం. ఇప్పటికే మండలాలకు పాఠ్యపుస్తకాలు, మెటీరియల్‌లు చేరాయి. కొన్ని కళాశాలల్లో ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయడం జరిగింది. విద్యార్థుల చెంత పాఠ్యపుస్తకాలు లేవు అనే మాట రాకుండా పంపిణీకి చర్యలు చేపడుతున్నాం. జిల్లాలోని ఏ ప్రభుత్వ కళాశాలలోనూ పాఠ్యపుస్తకాలు నిల్వ పెట్టుకోకుండా నిబంధనల ప్రకారం విద్యార్థులకు పంపిణీ చేసేయాలని ఆదేశాలిచ్చాం.

68 మంది ప్రిన్సిపల్స్, 400 అధ్యాపకులు బదిలీ

రాష్ట్ర ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారుల ఆదేశాల మేరకు బదిలీల కసరత్తు పకడ్బందీగా చేపడుతున్నాం. ప్రస్తుతం అంతర్గతంగా కసరత్తు చేపడుతున్నాం. బదిలీ ఉత్తర్వులు విడుదలైన తర్వాత ప్రిన్సిపల్స్, అధ్యాపకులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఆన్‌లైన్‌లో ఖాళీలు, పోస్టుల వివరాలను నమోదు చేసే ప్రక్రియ కొనసాగిస్తున్నాం. ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా దాదాపు 68 మంది ప్రిన్సిపల్స్, 400 మంది అధ్యాపకులు బదిలీ అయ్యే అవకాశాలున్నాయి. ఉత్తర్వులు జారీ అయ్యాక ఖాళీలను ఆన్‌లైన్‌లో పొందుపరుస్తాం. వాటి ప్రకారం ఆన్‌లైన్ విధానంలో బదిలీలు నిర్వహించడం జరుగుతుంది.

మేనేజ్‌మెంట్‌ల వారీగా కళాశాలలు

ప్రభుత్వ జూనియర్ కళాశాలలు	31
హైస్కూల్ ప్లస్	24
కేజీబీవీ	08
సోషల్ వెల్ఫేర్ గురుకులాలు	04
బీసీ వెల్ఫేర్ గురుకులాలు	01
ఏపీ మోడల్ స్కూల్స్	07
ప్రైవేట్ , కార్పొరేట్	65
మొత్తం కళాశాలలు	140

జూన్ 2న పునఃప్రారంభం

జూన్ 2 వ తేదీన కళాశాలలు పునఃప్రారంభం కానున్నాయి. జిల్లాలో అన్ని యాజమాన్యాలకు సంబంధించి 140 కళాశాలలుండగా, అందులో 65 ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలలున్నాయి. కళాశాలలు ప్రారంభం అయ్యాక ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలలపై ప్రత్యేక నిఘా పెట్టడం జరుగుతుంది. నిబంధనలకు విరుద్ధంగా, అనుమతులు లేకుండా ఎక్కడైనా కళాశాలలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. తల్లిదండ్రులు తమ పిల్లలను అడ్మిషన్‌లు చేసే సమయంలో కళాశాలకు అనుమతులున్నాయా లేవా అనే విషయాన్ని తెలుసుకున్న తర్వాత కళాశాలల్లో చేర్పించాలి.

క్లుప్తంగా

పలమనేరుకు చేరుకున్న కుంకీ ఏనుగులు

పలమనేరు : కర్ణాటక ప్రభుత్వం నుంచి పలమనేరు మండలంలోని కాలువపల్లి వద్ద నిర్మించిన ఎలిఫెంట్ క్యాంపునకు నాలుగు ఏనుగులు వచ్చినట్లు స్థానిక ఎఫ్ఆర్వో నారాయణ బుధవారం తెలిపారు. ఆ మేరకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ కర్ణాటక సీఎం, డిప్యూటీ సీఎం సమక్షంలో వీటిని స్వీకరించారు. ఈ కుంకీ ఏనుగుల పేర్లు రంజని, దేవా, కృష్ణా, అభిమన్యు ఉన్నాయి. వీటి సంరక్షణకు ఇక్కడి క్యాంపులో అవసరమైన మేతను అధికారులు సిద్ధం చేశారు. ఇప్పటికే శిక్షణ పొందిన కుంకీ ఏనుగుల కర్ణాటక మావటీలు స్థానిక రేంజిలో శిక్షణ పొందిన మావటీలు వీరి పర్యవేక్షణలో ఉంటారని అధికారులు తెలిపారు.

మామిడి దిగుబడిపై నివేదిక ఇవ్వాలి



మాట్లాడుతున్న జిల్లా ఉద్యాన అధికారి మధుసూదన్ రెడ్డి

తవణంపల్లె : మామిడి దిగుబడిపై అంచనా వేసి నిర్దిష్టమైన నివేదిక ఉంచాలని జిల్లా ఉద్యాన అధికారి మధుసూదన్‌రెడ్డి రైతు సేవా కేంద్రం సిబ్బందిని ఆదేశించారు. బుధవారం మండలంలోని పుణ్యసముద్రం రైతు సేవా కేంద్రంలో మామిడి దిగుబడి అంచనాపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతు సేవా సిబ్బంది పరిధిలోని రైతులను కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించి మామిడి దిగుబడి ఎన్ని టన్నులు వస్తుందని అంచనా వేసి నివేదిక తయారు చేయాలని సూచించారు. సీజన్ ప్రారంభం కాక ముందే ప్రణాళిక తయారు చేసే నివేదిక చాలా ఉపయోగపడుతోందని వివరించారు. అనంతరం ఫీల్ ఫ్రెష్ ఫుడ్ ఫ్యాక్టరీని తనిఖీ చేశారు. నిల్వ ఉన్న మామిడి కాయలను, ఫ్యాక్టరీని పరిశీలించి ఫల్ప్ తయారీపై ఆరా తీశారు. కార్యక్రమంలో హార్టికల్చర్ అధికారి సాగరిక, మండల వ్యవసాయాధికారి జి. ప్రవీణ్, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు



తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లన్నీ నిండాయి. క్యూలైన్ ఏటీజీహెచ్ వద్దకు చేరింది. మంగళవారం అర్ధరాత్రి వరకు 76,000 మంది స్వామివారిని దర్శించుకోగా 31,766 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.07 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 18 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

సర్వర్ పరేషాన్



సచివాలయంలో రేషన్‌కార్డు దరఖాస్తులకు లబ్ధిదారుల నిరీక్షణ

- రేషన్‌కార్డు దరఖాస్తుకు మొరాయిస్తున్న సర్వర్
- సచివాలయ సిబ్బంది సతమతం
- గందరగోళంగా దరఖాస్తుల ప్రక్రియ
- మ్యారేజ్ సర్టిఫికెట్ వద్దన్నా..పలుచోట్ల వేధింపులు
- పట్టించుకోని పౌరసరఫరాల శాఖ అధికారులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : కొత్త రేషన్‌కార్డుల సర్వర్లు పనిచేయకపోవడంతో సచివాలయ సిబ్బంది సతమతం అవుతున్నారు. దరఖాస్తు కోసం కార్డుదారులు ఉదయం నుంచి సాయంత్రం వరకు నిరీక్షిస్తున్నారు. తొలి నుంచి సర్వర్ సమస్య వెంటాడుతున్నా పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందన్న విమర్శలున్నాయి. కొత్తగా రేషన్‌కార్డు కావాలని దరఖాస్తు చేసుకునేవారికి ప్రభుత్వం వద్దన్నా.. పలుచోట్ల సచివాలయ సిబ్బంది మ్యారేజ్ సర్టిఫికెట్ కావాలని నిబంధన పెడుతున్నారు. దీంతో కార్డుదారుల దరఖాస్తు ప్రక్రియ ప్రహసనంగా మారింది.

18,100 దరఖాస్తులు

కొత్త రేషన్‌కార్డుల దరఖాస్తుల ప్రక్రియకు ఈనెల 7వతేదీ నుంచి ప్రారంభమైంది. ఏడాది కాలంగా కొత్త రేషన్ కార్డుల జారీ లేకపోవడం, రేషన్ కార్డులు చేర్పులు, తొలగింపులు వంటివి పనిచేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. కొత్త రేషన్‌కార్డుల జారీకి కూటమి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో అర్జీదారులు గ్రామవార్డు సచివాలయ సిబ్బంది చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన పరిస్థితి. ఈనెల 15వ తేదీ నుంచి మన మిత్ర వాట్సాప్ గవర్నెన్స్ సేవలు అందుబాటులోకి తెస్తామని ప్రభుత్వం చెప్పినా..అమల్లోకి రాలేదు. దీంతో రేషన్‌కార్డుకు దరఖాస్తు చేసుకునేవారు అవస్థలు పడుతున్నారు. కాగా జిల్లా వ్యాప్తంగా రేషన్ కార్డుకు సంబంధించి ఇప్పటి వరకు 18,100 దరఖాస్తులు వచ్చాయి.

ఒంటరి మహిళల దరఖాస్తులపై ఆంక్షలు

సర్వర్ సక్రమంగా పనిచేయకపోవడంతో జిల్లాలో అర్జీదారులు సచివాలయాల చుట్టూ తిరగడమే సరిపోతుంది. సర్వర్ సరిగ్గా పనిచేస్తే ఈపాటికి రేషన్ కార్డులు దరఖాస్తుల ప్రక్రియ పూర్తయ్యే పరిస్థితి ఉండేది. సర్వర్ సమస్య తట్టుకోలేక కొన్ని ప్రాంతాల్లో త్వరపడి సచివాలయ సిబ్బంది దరఖాస్తులను తీసుకోవద్దని వీఆర్వోలు ఆదేశాలు జారీ చేశారు. జూన్‌లో కొత్త రేషన్ కార్డులు మంజూరు ఉంటుందని పౌరసరఫరాల శాఖ మంత్రి ప్రకటించారు. సర్వర్ సమస్యతో కొత్త రేషన్ కార్డుల ప్రక్రియ మరింత ఆలస్యం అయ్యే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. కొత్త రేషన్ కార్డుల ప్రక్రియ సాగుతూ ఉండటంతో ఒంటరి మహిళలు దరఖాస్తు చేసుకునేందుకు వెళ్తున్నా నిరాశే ఎదురవుతోంది.

ముఖ్యంగా వివాహమై భర్తకు ఏళ్ల తరబడి దూరంగా ఉంటున్న ఒంటరి మహిళలకు సంబంధించి దరఖాస్తుల స్వీకరణ జరగడం లేదు. విడాకులకు సంబంధించిన వివరాలు ఉండాలంటూ చెబుతున్న పరిస్థితి నెలకొంది. భర్త నుంచి దూరమమై అనేక మంది మహిళలు ఒంటరిగా పిల్లలతో జీవిస్తున్నారు. విడాకుల కోసం తిరగలేక ఆర్థిక స్తోమత లేక అలాగే ఉండిపోయారు. ఇలాంటి ఒంటరి మహిళలకు కొత్త రేషన్ కార్డులకు సంబంధించి దరఖాస్తులు స్వీకరించకుండా ఆంక్షలు విధించటం ఏమిటని విమర్శలు వెల్లువెత్తున్నాయి.

వివాహ పత్రానికి మినహాయింపు ఏదీ..

రేషన్‌కార్డుదారులకు దరఖాస్తు చేసుకుంటున్న కొత్త జంటలకు ప్రభుత్వం మినహాయింపు ఇచ్చింది. ఇప్పటి వరకు తల్లిదండ్రుల కార్డుల్లో సభ్యులు కొనసాగుతున్న వారు కొత్తకార్డుకు దరఖాస్తు చేసుకుంటున్నారు. దీనికి మొదట్లో ప్రభుత్వం ఆధార్, పాతరేషన్‌కార్డుల నకలు, వివాహ ధ్రువీకరణ పత్రం తప్పనిసరి చేసింది. దీంతో అనేక మంది ప్రస్తుతం వివాహ రిజిస్ట్రేషన్ పత్రాలు తీసుకునేందుకు నానా పాట్లు పడ్డారు. నోటరీ, పెళ్లి శుభలేఖ, పెళ్లి సమయంలోని ఫొటోలు, వంటి తదితర వివరాలు కచ్చితంగా ఉండాలని కోరడంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. శుభలేఖలు లేనివారు ప్రింటింగ్ ప్రెస్‌లకు పరుగులు పెట్టారు. ఆ తర్వాత పెళ్లి పత్రాలు రావడానికి ఆలస్యమవుతుందని గుర్తించిన ప్రభుత్వం వివాహ ధ్రువీకరణ పత్రం విషయంలో మినహాయింపు ఇచ్చింది. అయితే పలుచోట్ల సచివాలయ సిబ్బంది పెళ్లి పత్రాల తప్పనిసరి అంటూ మెలిక పెడుతున్నారు.

అవగాహన లేక..

కొత్త రేషన్ కార్డులకు సంబంధించి ప్రారంభ సమయంలోనే ఆయా సచివాలయాల సిబ్బందికి అవగాహన శిబిరాన్ని నిర్వహించాల్సిన అవసరం ఉంది. అలా జరిగి ఉంటే ప్రభుత్వం ఆశించిన స్థాయిలో ఇప్పటి వరకు దరఖాస్తులు వచ్చేవి. కొన్ని ప్రాంతాలలో కులం సర్టిఫికెట్, ఆదాయ ధ్రువీకరణ సర్టిఫికెట్, కోరుతున్నారు. అదే సమయంలో గతంలో రేషన్ కార్డులో ఉన్న కుటుంబ సభ్యులను తొలగిస్తేనే, వారు పెళ్లి అనంతరం వారి ప్రత్యేక కుటుంబంతో దరఖాస్తు చేసుకోవటానికి వెసులుబాటు జరుగుతుంది. అలా చేర్పులు, మార్పులు తొలగింపులకు, సర్వర్ల ప్రక్రియ సక్రమంగా పనిచేయక అర్జీదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సచివాలయ సిబ్బందికి అర్జీదారులకు వచ్చిన సమస్యలు పరిష్కరించడానికి రెవెన్యూ యంత్రాంగంలో ప్రత్యేక సిబ్బంది లేకపోవడంతో ప్రారంభంలో తీవ్ర గందరగోళానికి దారి తీసింది. కొత్తగా సభ్యుల చేరిక మొదలుకుని ఇప్పటికే మృతి చెందిన, వివాహమై వెళ్లిపోయిన సభ్యుల వివరాలను మార్చడం లేదు. దరఖాస్తు దారులకు సమయం పొడిగించాలని, సర్వర్ల సమస్యను పరిష్కరించాలని, దరఖాస్తుకు జత పరచాల్సిన వివరాలను సచివాలయాల వద్ద అందుబాటులో ఉంచాలని ప్రజలు కోరుతున్నారు.

రేషన్‌కార్డుకు సంబంధించిన దరఖాస్తుల వివరాలు

రకం	సంఖ్య
చిరునామా మార్పు	235
ఆధార్ సీడింగ్ కరెక్షన్	287
సభ్యుల చేర్పు	13769
సభ్యుల తొలగింపు	301
కొత్త రేషన్‌కార్డు	1939
కార్డు విభజనకు	1528
సరెండర్ కార్డు	41

ఇబ్బందులు కలిగించొద్దు



కొత్తగా వివాహం అయిన జంటలకు వివాహ పత్రం అవసరం లేదు. దీనిపై పూర్తి స్థాయిలో సచివాలయ సిబ్బందికి ఆదేశాలు ఇస్తాం. వాళ్లను ఇబ్బంది పెట్టవద్దని చెబుతున్నాం. ఎక్కడైనా అలాంటి సమస్యలు వస్తే నేరుగా తనకు ఫిర్యాదు చేయవచ్చు. రేషన్ కార్డు మంజూరు చేయిస్తామని ఎవరైనా డబ్బులు అడిగితే నమ్మి మోసపోవద్దు. అర్హత ఉంటే కచ్చితంగా కార్డులు వస్తాయి. సర్వర్ సమస్య త్వరలో పరిష్కారమవుతుంది.

– శంకరన్ డీఎస్ఓ, చిత్తూరు

ఘనంగా కలశస్థాపన



కలశస్థాపన చేస్తున్న అర్చకులు

తవణంపల్లె : ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో హనుమాన్ జయంతి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. బుధవారం రాత్రి అర్చకులు స్వామికి అభిషేకం, ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహించి శాస్త్రోక్తంగా దూపదీప నైవేద్యం సమర్పించారు. అర్చకులు స్వామికి అంకురార్పణ, రక్షాబంధన, కలశస్థాపన చేయించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ హనుమంతురావు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

నేడు హనుమాన్ జయంతి

గురువారం ఆలయంలో ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవ, పంచామృత అభిషేకం, విశేష అలంకరణ, 9 గంటలకు ఆంజనేయస్వామి ఇరుముడి పూజ, తదితర కార్యక్రమాలు ఉంటాయని ఆలయ ఈఓ హనుమంతురావు తెలిపారు. 11 గంటలకు ఆంజనేయస్వామి సహస్ర నామ హోమం, ఉత్సవ విగ్రహ తిరుమంజనం, మంత్ర పుష్పం, మహామంగళ హారతి, తీర్థ ప్రసాద వినియోగం జరుగుతుందని వివరించారు. సాయంత్రం 5 గంటలకు తులసి పుష్పాలచే సహస్రనామ పూజ, రాత్రి 7 గంటలకు ప్రాకారోత్సవం వైభవంగా జరుగుతుందని పేర్కొన్నారు.

నేడు తిరుమలలో ట్రాఫిక్ ఆంక్షలు

తిరుమల : హనుమాన్ జయంతిని పురస్కరించుకుని గురువారం తిరుమలలో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. జపాలి తీర్థం వెళ్లేందుకు భక్తులు పోటెత్తనున్న నేపథ్యంలో ఉదయం 6 నుంచి సాయంత్రం 8 గంటల వరకు ట్రాఫిక్ ఇక్కట్లు తలెత్తకుండా చర్యలు చేపట్టారు. ఈ మేరకు సుమారు 10వేల నుంచి 15వేల వాహనాలు తిరుమలకు వచ్చే అవకాశమున్నట్లు పోలీసులు వెల్లడించారు. ప్రైవేట్ వాహనాలను ఆక్టోపస్ సర్కిల్ వరకు మాత్రమే అనుమతిస్తామని తెలిపారు. అక్కడ నుంచి భక్తులు కేవలం ఆర్టీసీ బస్సుల్లో మాత్రమే జపాలి తీర్థం, పాపవినాశనం వెళ్లాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

మృగరాజుపై వేణుగోపాలుడు





కార్వేటినగరంలో సింహవాహనంపై ఊరేగిన వేణుగోపాలుడు, ఊంజల్ సేవలో సేద తీరుతున్న రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి

కార్వేటినగరం : కార్వేటినగరం టీటీడీ అనుబంధ వేణుగోపాలస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో రోజు బుధవారం రాత్రి కాళ సర్పంపై నృత్య వేణుగోపాలుడుగా ముత్యపు పందిరి వాహనంపై కొలువుదీరారు. ఉదయం సింహ వాహనంపై వేణుగోపాలుడు భక్తులను అనుగ్రహించారు. తెల్లవారు జామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి నిత్యకైంకర్యాలు నిర్వహించారు. ఉదయం 7.30 గంటలకు నరసింహ అవతారంలో స్వామివారు సింహ వాహనంపై కొలువుదీరి పురవీధుల్లో విహరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం 10 గంటల నుంచి 11 గంటల మధ్య రుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఉత్సవమూర్తులకు వేదపండితులు వైభవంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం శ్రీకృష్ణ అవతారంలోని శ్రీవేణుగోపాలుడికి ఆలయ ఆవరణలోని ఊంజల్ మండపంలో టీటీడీ బృందం గాత్ర కచేరితో కనులపండువగా ఊంజల్‌సేవ నిర్వహించారు.

ఉభయ నాంచార్లుతో వేణుగోపాలుడు

వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం రాత్రి రుక్మిణీ సత్యభామ సమేతుడై శ్రీవేణుగోపాలుడు ముత్యపు పందిరి వాహనంపై కొలువుదీరి చిన్నారుల కోలాటాలు, మహిళల చెక్కభజనల, మంగళ వాయిద్యాలు, నడుమ అత్యంత వైభవంగా పురవీధుల్లో ఊరేగారు. భక్తులు ఇంటింటా కర్పూర హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి 9.30 గంటలకు ఏకాంత సేవతో స్వామివారిని పవళింప జేశారు. కార్యక్రమంలో ఏఈఓ రవి, సూపరింటెండెంట్ సోమశేఖర్, ఆలయ అధికారి సురేష్‌కుమార్, షరాబ్ బాబు సురేష్, కంకణభట్టర్ తరుణ్‌కుమార్, వేద పండితులు నారాయణదాసరథి, గోపాలాచార్యులు, రమేష్, శభరీష్, అలంకార పండితులు మోహన్‌బట్టాచార్యులు టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కల్యాణోత్సవం

కార్వేటినగరంలో జరుగుతున్న రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా నాలుగో రోజు గురువారం ఉదయం కల్పవృక్ష వాహనంపై స్వామి ఊరేగనున్నారు. ఈ క్రమంలో ఆలయంలో సాయంత్రం 5 గంటల నుంచి 6.30 వరకు ఆర్జిత కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ అధికారి సురేషకుమార్ చెప్పారు. రాత్రి 7 గంటల నుంచి సర్వభూపాల వాహనంపై తిరువీధి ఉత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు.

పార్టీలకతీతంగా పనిచేయండి





ఆగ్రహం వ్యక్తం చేస్తున్న జెడ్పీ సీఈఓ రవికుమార్‌నాయుడు, హాజరైన ఎంపీడీఓ కార్యాలయ ఏఓలు

- ఏఓలపై ఆగ్రహం వ్యక్తం చేసిన జెడ్పీ సీఈఓ

చిత్తూరు కార్పొరేషన్ : ప్రజల సొమ్ముతో చేసే పనులకు పార్టీల ముద్ర వేసి అడ్డుపడవద్దని జెడ్పీ సీఈఓ రవికుమార్‌నాయుడు తెలిపారు. బుధవారం జెడ్పీ సమావేశ మందిరంలో ఉమ్మడి జిల్లాలోని ఎంపీడీఓ కార్యాలయాల ఏఓలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. మండల స్థాయిలో సక్రమంగా పనిచేయకపోవడంతో గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదులు వస్తున్నాయని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అభివృద్ధి పనులు చేయించడం వదిలేసి రాజకీయముద్ర వేసుకోవద్దని హితువు పలికారు. మండల స్థాయిలో నిర్వహించే గ్రీవెన్స్‌లో సమస్యలు వచ్చిన వాటిని నమోదు చేయకుండా ఏఓలు నిర్లక్ష్యంగా ఉన్నారన్నారు. దీంతో అక్కడ పట్టించుకోవడం లేదని జిల్లా స్థాయిలో ఫిర్యాదులు ఇస్తున్నారన్నారు. పనులను క్షేత్ర స్థాయిలో కనీసం పరిశీలించడం లేదని తెలుస్తోందన్నారు. ఇంత అధ్వానంగా పనిచేస్తే ఎలా అని ఆయన అసహనం వ్యక్తం చేశారు. మండలాల్లో దాదాపు 10–15 పనులను పరిశీలిస్తారని వాటిని చూడటానికి మీకు ఓపిక లేదా అని సీఈఓ ప్రశ్నించారు. తూర్పు మండలాల్లో 500 అడుగులు లోతులో బోరు వేస్తున్నట్లు బిల్లులు పెట్టడం చూసి విస్తుపోతున్నామన్నారు. ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన కింద దళితవాడల్లో వసతుల కల్పన పై ఎందుకు శ్రద్ధపెట్టడం లేదన్నారు. పంచాయతీరాజ్ పరిధిలో 5 ఏళ్లు దాటిన ప్రతి ఉద్యోగిని బదిలీ చేస్తామని స్పష్టం చేశారు. రెండేళ్లు దాటిన వారు రిక్వెస్టు, మ్యూచువల్ మేరకు మార్పు చేయనున్నామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఈఓ జుబేదా తదితరులు పాల్గొన్నారు.

డీసీహెచ్‌ఎస్‌లో వర్గపోరు



జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి కార్యాలయం

- జిల్లా ఆస్పత్రిని తాకిన సెగ
- అంతా తానై వ్యవహరిస్తున్న ఇద్దరు అధికారులు
- ఇష్టానుసారంగా డెప్యూటేషన్లు రద్దు
- కలెక్టర్, కమిషనర్ ఉత్తర్వులు బేఖాతరు

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : డీఎసీహెచ్ కార్యాలయంలో కొందరు ఉద్యోగులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. దీనికి తోడు వర్గపోరు పుంజుకుంటోంది. ఈ ప్రభావం డీహెచ్ (జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి) కార్యాలయంపై పడింది. ఆ ఇద్దరు అధికారులు కలిసి అంతా తామై చక్రం తిప్పుతున్నారు. ఇష్టానుసారంగా డెప్యుటేషన్లు రద్దు చేయడం..ఆ తప్పులను డీసీహెచ్ఎస్, కమిషనర్ మీదకు నెట్టేస్తున్నారు. కలెక్టర్, కమిషనర్ ఉత్తర్వులను బేఖాతరు చేస్తూ...ఉద్యోగులు, సిబ్బందిని వేధింపులకు గురిచేస్తున్నారు.

భయపడుతున్న అధికారులు, సిబ్బంది..

జిల్లా వైద్యవిధాన పరిషత్ పరిధిలో ఒక జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి, నాలుగు ఏరియా ఆస్పత్రులు, 8 సీహెచ్‌సీలున్నాయి. ఈ పరిధిలో సుమారు 500 మందికి పైగా పనిచేయగా డెప్యుటేషన్‌లో 40 మంది ఉన్నారు.. వీరిలో వర్గపోరు తారస్థాయి చేరుకుంది. ప్రధానంగా ఏఓ, ఏడీ పోస్టులు ఖాళీ అయిన దగ్గర నుంచి ఈ వర్గపోరు ఉధృతమైంది. డీసీహెచ్ఎస్ కార్యాలయంలో పనిచేసే ఓ అధికారి అంతా తాను చెప్పినట్లే జరగాలని ఈ పోరుకు ఆజ్యం పోస్తున్నారు. రాష్ట్ర కమిషనర్ శాఖలో పని చేశానని గొప్పలు చెప్పకుంటూ..రాష్ట్ర స్థాయి నుంచి గ్రామస్థాయి వరకు అందరూ తనకు సుపరిచితులే అంటూ భయపెడుతున్నాడని కార్యాలయ సిబ్బంది, పలువురు అధికారులు వాపోతున్నారు. ఇటీవల డీసీహెచ్ఎస్ కార్యాలయంలో ఖాళీగా ఉన్న ఏఓ పోస్టుకు ఇద్దరు అధికారులు పోటీ పడ్డారు. కానీ ఆ అధికారి పుంగనూరులో పని చేస్తున్న ఓ అధికారిని ఏఓ పోస్టుకు తెచ్చుకోవాలని గట్టి ప్రయత్నాలు చేశారు. తొలుత ఏడీ కుర్చీలో కూర్చోబెట్టాలని విశ్వ ప్రయత్నాలు చేశారు. ఇది ఫలించకపోగా..ఏఓ కుర్చీకి ప్రయత్నాలు చేసి విఫలమయ్యారు. ఇటీవల డీసీహెచ్ఎస్‌కు అనుకూలమైన ఓ అధికారి ఏఓ బాధ్యతలను చేపట్టారు. ఇది గిట్టక కార్యాలయంలో గందరగోళం సృష్టించాలని, డీసీహెచ్ఎస్‌కు చెడ్డపేరు తీసుకురావాలనే ఉద్దేశంతో ఆ అధికారుల వర్గం పావులు కదుపుతోంది.

ఎలాంటి ఆర్డర్లు లేకుండానే..

కుటుంబ, ఆరోగ్య పరమైన కారణాలతో కలెక్టర్, కమిషనర్ అనుమతితో డెప్యుటేషన్‌పై పనిచేస్తున్నారు. వారిని పనిచేస్తున్న స్థానం నుంచి రిలీవ్ చేయాలన్న రాష్ట్ర అధికారుల ఉత్తర్వులు ఉండాలి. అయితే డీసీహెచ్ఎస్, డీహెచ్ కార్యాలయంలో అవేవీ చెల్లుబాటు కావడంలేదు. ఓ వర్గం అధికారి చెబితేనే జిల్లాలోని ఆస్పత్రుల్లోని సూపరింటెండెంట్లంతా వణుకుతున్నారు. లేకుంటే ఆ అధికారి రాష్ట్ర కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తారనే భయం ప్రతి ఒక్కరిలోనూ వెంటాడుతోంది. కమిషనర్ ఆర్డర్లు లేకపోయినా..జిల్లాలో ఆ అధికారే జిల్లాకు డీసీహెచ్ఎస్, కమిషనర్ లెక్క పనిచేస్తున్నారని కార్యాలయ అధికారులు వాపోతున్నారు. ప్రధానంగా జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులు, సిబ్బందిని టార్గెట్ చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆ కార్యాలయంలోని మరో అధికారితో చేతులు కలిపి ఈ డెప్యుటేషన్లు రద్దుకు పూనుకున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. అది కూడా వాళ్ల వర్గానికి మాత్రమే ఆ డెప్యుటేషన్లను పరిమితం చేశారని పలు విమర్శలకు తావిస్తోంది. వీటిపై విచారణ చేపడితే ఆ అధికారి అక్రమ బాగోతాలు బయట పడుతున్నాయని చెబుతున్నారు. వీరిపై రాష్ట్ర, జిల్లా అధికారులకు కూడా పలు ఫిర్యాదులు వెళ్లాయి. డెప్యూటేషన్ల రద్దుపై అధికారులను ప్రశ్నిస్తే మాకేం సంబంధం లేదంటూ ఒకరిపై ఒకరు నిందలు వేసుకుంటున్నారు. డీసీహెచ్ఎస్ నోటి మాటగా చెప్పడంతో చేశామని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి అధికారి బదులిచ్చారు.

డెప్యుటేషన్ రద్దు తెలియదు

డెప్యుటేషన్ రద్దు ఎప్పుడు చేయమన్నాను. నేను ఎప్పుడూ చెప్పలేదు. ఏదైనా ఆర్డరు పెట్టండి కనుక్కుంటా. ఈ ఆర్డర్‌తో నాకు సంబంధం లేదు. అది ఆస్పత్రి వాళ్లు ఇచ్చుకున్నారు. విచారిస్తాను. చర్యలు తీసుకుంటా.

– పద్మాంజలి, డీసీహెచ్ఎస్, చిత్తూరు

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన కారు



ప్రమాదానికి గురైన కారు



కారు ఢీకొనడంతో విరిగిన విద్యుత్‌స్తంభం

గుడిపాల : డ్రైవర్ నిద్రమత్తు కారణంగా ఓ కారు విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టింది. దీంతో కారు పల్టీలు కొట్టింది. కారులో ప్రయాణిస్తున్న వారికి ఎటువంటి గాయాలు కాలేదు. బెంగుళూరు నుంచి గుడిపాల మండలంలోని కొత్తకోట గ్రామానికి కారులో అదే గ్రామానికి చెందిన వారు వెళ్తున్నారు. బుధవారం తెల్లవారుజామున డ్రైవర్ నిద్రమత్తు కారణంగా కుప్పిగానిపల్లె గ్రామం సమీపంలోని రోడ్డు పక్కన ఉన్న 33 కేవీ విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. దీంతో విద్యుత్ స్తంభం విరిగిపోయింది. కారులో ప్రయాణిస్తున్న వారికి ఎటువంటి గాయాలు కాకుండా క్షేమంగా భయటపడడంతో ఊపిరిపీల్చుకున్నారు.